# స్కైలాబ్

భైరవయ్యకి విసుగ్గా చిరాగ్గా అసహనంగా వుంది.

పంచభక్ష్య పరమాన్నాలు కావాలా అరగ్లాసుడు సారా కావాలా అంటే, సారాయే కావాలని మొహమాటం లేకుండా చెప్పే భైరవయ్య సారా చుక్క రుచి చూసి వారం రోజులయ్యింది మరి.

అక్కడికీ సారా కొట్లో పదిరూపాయలు అరువు చేశాడు కూడానూ అంతకు మించి మరి అరువు పుట్టలేదు. అప్పు పుట్టలేదు. డబ్బూ కిట్టలేదు. డబ్బు కిట్టనందుకు జనం మీద కోపంగా వుంది. ఎంచేతంటే అతడు బతికేదే జనం మీద!

నల్లగా దుక్కలా కండలు తిరిగిన శరీరంతో ఒళ్లంతా వెంట్రుకల్తో యమధర్మరాజుల వారి వాహనమా అన్నట్టుండే భైరవయ్య క్షుద్ర దేవతోపాసకుడు. గాలీ ధూళీ సోకితే సోకేట్టుంటే తాళ్లు కడతాడు. తాయెత్తులిస్తాడు. చేతబడి చేస్తాడు. ఎవరైనా చేస్తే వదిలిస్తాడు. దెయ్యాల్ని భూతాల్ని కూడా వదిలిస్తాడు.

ఆ గాటి కార్యక్రమాలు తప్ప మరో పని చెయ్యడతడు. గత నెల

రోజుల్నుంచీ 'కేసు' లేం లేకపోవడంతో ఎలా వుండకూడదో అలా వుందతడి పరిస్థితి.

సారా కొట్లో ఇక అరువు లేదనిపించుకుని తిట్టుకుంటూ ఇంటి కొచ్చే సరికతడి భార్య శోకాలు తీస్తోంది.

"ఏంటే చెవికోసిన మేకలా ఏడుత్తున్నావ్. ఏటయ్యిందీ" అని విసుక్కున్నాడు.

"ఇంకేవంటాను దేవుడోయ్, అంతా బూడిదైపోయింది దేవుడోయ్. నానేం జేద్దును దేవుడోయ్...."

"బూడిదవ్వడం ఏంటే నీ ఎసం. ఏడుపాపి సరిగ్గా సెప్పేడు" కోపంగానే అన్నాడు.

"నీకు తెల్దా ?" ఏడుపుకి కామా పెట్టి అడిగిందామె.

"ఏ సంగతే ?"

"ఇంకో పదిరోజుల్లో ఆకాశం మీంచి భూతవొ౯ ఏదో పడద్దంట. వూరూ వాడా గొడ్డూ గోదా అంతా నాశినం అయిపోద్దంట దేవుడోయ్. ఇంకెలా సచ్చేది దేవుడోయ్. పిల్లా జెల్లా ఎదిగిరాలేదు దేవుడోయ్...." అంటూ ఏడుపు పొడిగించేసేసరికి ఒళ్లు మండిపోయిందతడికి.

"నోర్ముయ్యే ఎర్రి మాలోకమా. ఎవరో ఏదో అంటే కొంప లంటుకుపోయినట్టు ఏడుత్తావెందుకే".

"నిజివేనంట. వూరోళ్లంతా ఇదే అనుకుంటున్నారు. పెసిరెంటు గోరు అదేదో వూరెళ్లి పోతారంట. ఈ చుట్టు పక్కలెక్కడున్నా సచ్చి పోతారంట"

"ఇదేదో గొప్ప సిత్రం లాగుందే" అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు భైరవయ్య. ఆ పిమ్మట బజారు వైపు నడిచాడు.

కొన్ని డప్పులు ఎదురొచ్చాయ్. డప్పుల మధ్య అమ్మవారుషూనగా

కేకలేస్తున్న గణాచారినీ ఆ వెనుక వేప రొట్టలు కట్టి లాక్కొస్తోన్న మేకపోతునీ చూసేసరికతడి నుదురు ముడివడింది.

"ఏంట్రా వేట యేత్తన్నారెందుకు" ఒకతన్ని అడిగాడు.

"నీకు తెల్దా ? పది పన్నెండ్రోజుల్లో ఆదేదో పెద్ద విమానం లాంటిది పై నుంచి పడద్దంట. అదెక్కడపడితే అక్కడా ఆ చుట్టు పక్కలా మనిషి కాదు కదా పిట్ట కూడా బతకదంట. అది మనూళ్ళో పడకుండా నాలుగు పొలిమేర్లలోనూ వేటపోతుల్ని బలిస్తున్నాం. మనూర్ని అమ్మోరు చల్లగా కాపాడద్దని పెశిడెంటుగా రిమ్మన్నారు."

అలాగా అన్నట్టు తలూపి మొత్తానికేదో పెద్ద గొడవే జరగ బోతుందనుకుంటూ ముందుకి నడిచాడు.

దారి పొడవునా జనం—ఆడా మగా కూడా ఇళ్ల బయటికొచ్చి మరీ వింతగా చెప్పుకుంటూండటం అతడి చెవిని పడుతూనే వుంది.

గణపతి కాఫీ హోటల్‌కెళ్ళాడు భైరవయ్య.

పేపర్ చదువుతోన్న ఓ వ్యక్తి చుట్టూ మిగిలినవాళ్ళు మూగారు.

చదవటం పూర్తి చేశాక అన్నాడతడు "జూలై పది నుండి పందొ మ్మిదో తారీఖు లోపల స్కైలాబ్ భూమ్మీద కూలిపోతుందిట. ప్రపం చంలో ఎక్కడైనా అదీ పడొచ్చట. మన రాష్ట్రింలో పడుతుందని చాలా మందీ భయపడుతున్నారని పేపర్లో రాశారు. ఎక్కడపడేదీ కరక్టుగా ఒక్కరోజు ముందు మాత్రమే చెప్పగలరట"

"మొత్తానికి దెబ్బతో ప్రళయం రావటం తథ్యం!"

"ఇలాంటిదేదో జరుగుద్దని బ్రహ్మంగా రెప్పుడో చెప్పేరు. కుర్ర కారు వినరుగాని బ్రహ్మంగారు చెప్పిందల్లా జరుగుతూనే వుంది"

"అంత ఇదై పోతారెందుకోయ్. ఇంకో పది రోజుల్లో ఎలాగూ ఛావడంఖాయం గాని, ఈలోగా హాయిగా జల్సాచేసి ఖుషీ చేస్తే సరి"

తలోరకంగా చేస్తోన్న వ్యాఖ్యానాల్నివింటూ టీ తాగుతున్నాడు భైరవయ్య.

"అన్నట్టొరే భైరవా! నీ చేతిలో చాలా శక్తులుంటాయి కదురా. ఆ స్కైలాబ్ మనూరి మీద పడకుండా ఏవైనా పూజలూ గట్రా చెయ్యకూడదూ?" ఒక నడివయస్సాయన అడిగాడు.

అంతా ఏవంటావన్నట్లు తన వంకే చూస్తూండటం గమనించి "ఆ ప్రయత్నం మీదే వున్నానండి" అనేసి బయటికొచ్చేశాడు.

పైనుంచి పడి ప్రాణాలు తీసే యంత్రం ఏవిటో ఎప్పుడు పడద్దో ఏవిటో పూర్తిగా తెలుసుకుంటే తనకి బాగా వుపయోగపడుతుందన్పించింది. ఎవర్నడిగితే బాగుంటుందా అని ఓ క్షణం ఆలోచించాడు.

బడి పంతులు గుర్తొచ్చాడు. ఇంకో క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా ఆయనింటి కెళ్ళాడు.

"ఏం రా భైరవా. ఏదైనా పనిమీదొచ్చావా?" అతడ్ని చూస్తూనే అడిగారాయన.

"పనేవండి. పైనించేదో పడద్దని వూరంతా గగ్గోలుగా వుంది కదండీ. ఆ ఇనయాలు సెబుతారనీ...." బుర్రగోక్కుంటూ అన్నాడు.

ఆయన కొంచెం ఇబ్బందిగా చూశారు. స్కైలాబ్ గురించాయనకి పూర్తిగా తెలీదు. పేపర్లో ఒక వారం రోజుల్నుంచి వస్తోన్న వార్తల్ని బట్టి మాత్రం కొంతవరకూ విషయం గ్రహించారు. అయినా తనకి పూర్తిగా తెలీదన్న వాస్తవాన్ని బయటపెట్టి ఆ పల్లె ప్రజ ముందు తేలికైపోదలచుకోలేదు.

అందుకే దీర్ఘంగా నిశ్వసించి అన్నారు "అవునోయ్. స్కైలాబ్ అని ఓ పెద్ద రాకెట్ లాంటి యంత్రాన్ని అమెరికావారు ఆకాశంలోకి పంపారు. అది భూమి చుట్టూ తిరుగుతూంటుందన్నమాట...."

"ఎందుకండీ తిరగటం?!"

"ఎందుకంటే ఏవో పరిశోధనల కోసమన్నమాట. అనుకోకుండా కొన్ని మార్పులు రావడంతో ఆ యంత్రం భూమ్మీద కూలిపోబోతోంది. మొత్తం యంత్రమంతా ఒక్కచోటే పడదు. ముక్క ముక్కలుగా పడుతుందన్నమాట ముక్క చిన్నదే అయినా పెనువేగంతో మంటల్ని చిమ్ముతూ పడుతుంది. మనూరి మీద ఓ బుల్లి ముక్కపడితే చాలు వూరు వూరంతా భస్మమైపోతుంది"

"నిజంగా నాండి?"

"భలే వాడివోయ్. మరి స్కైలాబ్ అంటే పిల్లకాయలాడుకునే రబ్బరు బంతిలాంటి దనుకున్నావా? అంతటితో ఆగితే ఫరవాలేదు. చుట్టు పక్కలి వూళ్ళలో కూడా జనం చచ్చిపోవచ్చంట. ఓ యాభై మైళ్ళవరకూ విషవాయువులు వ్యాపించి జీవరాశి రాలిపోవచ్చట. అంచేతే చాలా మంది ఢిల్లీయో కలకత్తాయో పారిపోతున్నారు"

"మరక్కడ పడదాండీ?"

"అక్కడ పడక పోవచ్చునట. మన రాష్ట్రింలోనూ మన చుట్టు ప్రక్కల రాష్ట్రాల్లోనూ పడే అవకాశా లెక్కువగా వున్నాయంటున్నారు"

"ఏం పేరన్నారూ-స్కయ్యిలాబ్బా?"

"స్కయ్యిలాబ్బుకాదు. స్కైలాబ్"

"మరొత్తానండి దండాలండి"

హుషారుగా ఇంటి ముఖం పట్టాడు భైరవయ్య ఆ మర్నాడు పట్నం వెళ్ళి తనకు తెలిసిన కంసాలి చేత అర్జంటుగా ఓ యాభై తాయెత్తులు చేయించి తీసుకొచ్చాడు.

ఆ ఉత్తర క్షణాన్నుంచే స్కైలాబ్ జనం మీద పడకుండా పెద్ద ఎత్తున గ్రహశాంతి చేస్తున్నట్టు ప్రచారం చేశాడు.

రెండ్రోజులు నిష్ఠగా పూజా వుండి మూడోరోజున అర్ధరాత్రివేళ శ్మశానంలోకి వెళ్ళి పెద్దగా మంత్రోచ్ఛరణ చేస్తూ ఒక మేకని బలి ఇచ్చి మరీ పూజ చేశాడు.

బారెడు పొద్దెక్కేక పూజ నుంచి లేచి వచ్చిన భైరవయ్య ప్రళయ కాలరుద్రుల్లా భయంకరంగా వున్నాడు.

నుదుట ధరించిన పెద్ద కుంకుమ బొట్టు, ఒంటి మీదా కట్టుకున్న అంగోస్త్రం మీద మెరుస్తోన్న మేక రక్తపు మరకలూ, మెడలోని రుద్రాక్ష మాలా, ఎర్రబడ్డ కళ్ళూ, చేతిలో పసుపు కుంకాలద్దిన ఎముక, ఇక తన సహజ కారుమేఘ వర్ణం, భీకర రూపమూ కూడా తోడవడంతో భైరవయ్య వీరభద్రుల్లా వున్నాడు.

తిన్నగా ప్రెశిడెంటుగారింటికెళ్ళి "అయ్యగారూ" అని పిల్చాడు.

"ఎవర్రా" అంటూ బయటికొచ్చిన ప్రెశిడెంటుగారు నాలుగు ఖూనీలు చేసి వచ్చినట్టుగా వున్న భైరవయ్యని చూసి ఒక్కడుగు వెనక్కేశారు-తనకి తెలీకుండానే.

"ఏం రా భైరవా" మెల్లగా అన్నారో క్షణానంతరం.

"దండాలండి. స్కయిలాబ్ అకాశం మీంచి మన మీద పడకుండా పూజలు చేశానండి. ఇదిగో తాయెత్తు తెచ్చేనండి. ఇది కట్టుకుంటే సాలండి ఆ ఇంటి మీద స్కయిలాబు కాదు గదా దాని బాబు కూడా పడదండి"

ప్రెశిడెంటుగారికి చాలా సంతోషం వేసింది. స్కైలాబ్ బారి నుండి రక్షించుకోడానికి కుటుంబ సమేతంగా ఏ వూరు వెళ్ళిపోదామా అని తీవ్రంగా ఆలోచిస్తున్నారాయన!

"మంచి పన్జేశావురా భైరవా. ఏదీ ఆ తాయెత్తిలా పట్రా"

"ఇంకొంచెం పనుందండి. ఓ నల్ల కోడిపెట్టని తెప్పించండి"

ప్రెశిడెంటుగారు ఆజ్ఞ ఇవ్వడం ఆలస్యం ఓ కోడిపెట్ట తేబడింది.

దాని తలకి పసుపు కుంకాలు రాసి మెడలో వేపరొట్ట కట్టి ఏవో మంత్రాలు చదువుతూ కటిక్కిన పళ్ళతో దాని పీకని కొరికి పారేశాడు భైరవయ్య.

కోడి వెచ్చని రక్తంతో తాయెత్తుని తడిపి ఇంటి చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణం చేసి వచ్చి తాయెత్తు నందిచ్చాడు.

ప్రెశిడెంటుగారూ ఆయనింటిల్లపాదీ మహదానందపడ్డారు. వెంటనే ఓ వదీ రూపాయలు తెచ్చిచ్చారు కూడా.

మహాప్రసాదంగా స్వీకరించి నమస్కరించి వచ్చేశాడు భైరవయ్య వార్త క్షణాల మీద పూరంతా ప్రాకిపోయింది.

ఊళ్ళోని మోతుబరి రైతుల దగ్గర్నుంచీ వ్యాపారస్తుల దగ్గర్నుంచీ భైరవయ్యకి కబురు మీద కబురు రాసాగింది.

తాయెత్తులో కొంచెం బంగారం కూడా పెట్టబడిందనీ అంచేత దాని ఖరీదు యాభై ఒక్క రూపాయలనీ చెప్పేడు.

ప్రాణ భయంతో నిద్ర పట్టక కొట్టుకొంటూ ఆస్తిపాస్తుల్ని వదలి మరోచోటుకి పారిపోలేక సతమతమవుతోన్న భూస్వాములకి అదో పెద్ద మొత్తంగా అన్పించలేదు.

రెండ్రోజుల్లో నలభై తాయెత్తులు అమ్మేశాడు భైరవయ్య. చిన్న చిన్న వాళ్ళ కోసం తక్కువ రకం తాయెత్తులు కూడా అమ్మేడు.

మొత్తానికి నాలుగైదు రోజుల్లో మూడువేల వరకూ సంపాదించాడు. అతడి ఆనందానికి అంతు లేకుండాపోయింది. చిల్లర బాకీలూ సారాకొట్టు బాకీ తీర్చేసి ఓ రెండ్రోజుల పాటు పీకమొయ్యా సారా తాగేసి పడుకుండిపోయాడు.

ఆ రోజు రాత్రే స్కైలాబ్ భూమ్మీద పడుతుందనీ, అది మన

దేశం మీద 97 శాతం వరకూ పడకపోవచ్చనీ, ప్రజలు కంగారు పడా ల్సిన అవసరం లేదనీ పత్రికలు రాశాయి. రేడియో పదేపదే చెప్పింది.

కాని జనానికి ఆ మాటల మీద నమ్మకం కలగలేదు. ఇలాంటి వార్తల్లో నిజం తక్కువ వుంటుందనీ ఫలానా చోట పడుతుందని ముందే చెబితే ముందే తొక్కిసలాటతోనో భయభ్రాంతులయ్యో కొట్టుకు ఛస్తారని అబద్ధాలు ప్రచారం చేస్తారని అనుకున్నారు చాలామంది.

దాంతో ఆ రోజున ఎలాటి పనులూ సాగలేదు. కూలీలెవ్వరూ కూలికి పోలేదు. రైతులూ పని చేయించుకోగల స్థితిలో లేరు. రేపటికి బ్రతికి వుంటమో లేదోనన్న భీతే అందరిదీనూ.

శ్మశాన వైరాగ్యం కూడా ఆవరించింది చాలామందిని. పొరుగూరి పనులున్నా వెళ్ళి ఆ వూళ్లో చచ్చే కన్నా స్వంత వూళ్ళో స్వంత ఇంట్లో చావడం మేలని ప్రయాణాలు మానేశారు.

ప్రెశిడెంటుగారూ మరి ఇద్దరు పెద్ద భూస్వాములూ హైదరాబాద్ వెళ్ళి యారు సకుటుంబంగా.

మరికొందరు ఇవాళొక్కరోజే బ్రతకటం గనుక జల్సా చేద్దామను కుని ఆ పనిలో పడ్డారు.

చాలా ఇళ్ళల్లోంచి మసాలా ఘుమ ఘుమ లొచ్చాయ్ ఆవాళ. సారా కూడా పండుగల్లో కూడా అమ్మనంత ఎక్కువగా అమ్మింది.

తాయెత్తులు కట్టించుకున్న వాళ్ళలో చాలామందికి కొద్దో గొప్పో ధైర్యంగానే వుంది. స్కైలాబ్ తమ ఇంటిమీదపడదని! భైరవయ్య భార్యది కూడా అదే ధీమా! మగడి మీద ఆమెకి భక్తి గౌరవం అమాంతం పెరిగి పోయాయి కూడానూ.

కాని భైరవయ్యకి మాత్రం చచ్చేంత భయంగా వుంది. తాయెత్తుల మహత్యం గురించిన నిజం అతడికి తెలుసు. అంచేత అంత భయంగా వుంది.

తాయెత్తుల్ని మూఢంగా నమ్మి ధరించిన జనుల గుండె నిబ్బరం అతడికెలా వస్తుంది మరి ?

అవాళ వూరంతా పిచ్చికుక్కలా తిరిగేశాడు భైరవయ్య. ఎక్కడ చూసినా స్కైలాబ్ గొడవే. ఎవరిలో చూసినా ప్రాణభీతే. తన దగ్గర డబ్బుంది గనుక ఏ వూరైనా పారిపోతే బావుంటుందన్న ఆలోచనా రాక పోలేదు. కాని జనానికి తెలిస్తే పిచ్చికుక్కని కొట్టినట్లు తరిమి తరిమి కొడతారని వూరుకుండి పోయాడు.

ఏమైతే అయిందని తెగించి ఆ సాయంత్రం పూటుగా తాగేసి వచ్చి పడుకున్నాడు. కాని నిషా పూర్తిగా నిలవట్లేదు. ఏ చిన్న శబ్దమైనా సరే స్కైలాబ్ ఏమోనని వులిక్కిపడి బయటికొచ్చి చూస్తున్నాడు. అతడి భార్య మాత్రం తాయెత్తుని గుప్పిట్లో బంధించి హాయిగా నిద్రపోతోంది పిల్లల్ని పక్కలో పడుకోబెట్టుకుని.

ఫెళ ఫెళమని శబ్దమయ్యింది.

"బాబోయ్ స్కయిలాబు!" అంటూ అరుస్తూ ఇంట్లోంచి బయటికి దూసుకెళ్ళి పరుగిచ్చు కున్నాడు బైరవయ్య.

తన ఇంటి మీదగాని ఆ చుట్టుపక్కలగాని పడివుంటుందనే నమ్మకంతో వెనుదిరిగి చూస్తూ పరుగెడుతున్న వాడల్లా ఎదురుగుండా వస్తోన్న ఆంబోతుని గమనించక గుద్దేశాడు. అది కొమ్ము విసిరింది.

మరుక్షణం అతడి పొట్టలోంచి ప్రేగులు బయటికొచ్చాయి.

"అమ్మా" అని ఆర్తనాదం చేసి కూలబడిపోయాడు.

తెల్లారేక రక్తపు మడుగులో పడివున్న భైరవయ్యని చూసి జనం "స్కైలాబ్ బలి కోరింది" అనుకున్నారు.

(విపుల. డిసెంబరు 79)

(శ్రీ కె. యల్. రంగనాధరావుచే కన్నడంలోకి అనువదింపబడి 'మధుకర' జూన్ '81'లో ప్రచురింపబడినది.)